సాక్షి పశ్చిమగోదావరి

గురువారం : 16 : మే : 2024



స్వర్ణమయ పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి విమానగోపుర స్వర్ణ మయ పథకానికి వి.చంద్రశేఖర్ తన భార్య చంద్రకళ (పెదఅమిరం) ద్వారా 57.580 గ్రాముల బంగారాన్ని సమర్పించారు.



కొల్లేరు చుట్టూనే రాజకీయం

సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు జిల్లాలో కొల్లేరు గ్రామాల ఓట్లు కీలకంగా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

10లో ▸



17 నుంచి నాటిక పోటీలు

యలమంచిలి మండలం కొంతేరు గ్రామంలో ఈనెల 17 నుంచి అఖిల భారత స్థాయి నాటిక పోటీలు నిర్వహించనున్నారు.

10లో ▸

న్యూస్‌రీల్

కాలువలకు అడ్డుకట్ట



కాలువలో అడ్డుకట్ట వేస్తున్న కార్మికులు

పాలకొల్లు సెంట్రల్: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా పాలకొల్లు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యల్లో భాగంగా కాలువకు అడ్డుకట్ట వేశారు. రెండు రోజుల క్రితం కాలువలు కట్టివేయడంతో బుధవారం అధికారులు స్థానిక దాసరి నారాయణరావు కాలిబాట వంతెన వద్ద కాలువకు ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. మున్సిపల్ డీఈ రాజ్‌కుమార్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా రెండు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేశామన్నారు. మళ్లీ కాలువలకు వచ్చేనెల 10న నీటిని విడుదల చేసే అవకాశం ఉందన్నారు. అప్పటి వరకూ పట్టణంలో రెండు పూటలా నీరందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అడ్డుకట్టతో మరో పది రోజులు కాలువ నీటిని వాడుకోవడానికి అవకాశం ఉందన్నారు. అనంతరం ఎస్ఎస్ ట్యాంకుల్లో స్టోరేజ్ చేసిన నీటిని వినియోగిస్తామన్నారు. ఇప్పటికే ఎస్ఎస్ ట్యాంకుల్లో 12 అడుగుల వరకూ నీటిని నిల్వ చేశామన్నారు. ఏఈ సాంబశివుడు ఉన్నారు.

ఐటీఐలో ప్రవేశాలు

ఉండి: జిల్లాలో 2 ప్రభుత్వ, 16 ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. 2024–25లో వచ్చే నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తప్పనిసరిగా తమకు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ (ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం, ఆచంట)లో ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో వెరిఫికేషన్ చేయించుకుని రసీదు పొందాలని తెలిపారు. కౌన్సెలింగ్ సమయంలో రసీదు తప్పనిసరిగా చూపించాలని లేకుంటే కౌన్సెలింగ్‌కు అనర్హులను పేర్కొన్నారు. దరఖాస్తులకు, వెరిఫికేషన్‌కు జూన్ 10 తుది గడువు అని తెలిపారు. మరిన్ని వివరాలకు ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐకి నేరుగా వచ్చి లేదా 08816 297093 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

21న క్రికెట్ సెలెక్షన్స్

ఏలూరు రూరల్: భీమవరం డీఎన్నార్ కళాశాల మైదానంలో ఈనెల 21న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహిళల క్రికెట్ జట్లు ఎంపిక పోటీలు చేపట్టనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఆదిత్యవర్మ, కార్యదర్శి వీపీఎస్ఎం శ్రీనివాసరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఏసీఏ ఇంటర్ డిస్ట్రిక్స్ పోటీల్లో భాగంగా అండర్–15, 19, 23 విభాగాలతో పాటు సీనియర్ ఉమెన్ జట్లు ఎంపిక ప్రక్రియ చేపట్టామన్నారు. 1-9-2009 నుంచి 31-8-2011 మధ్య పుట్టినవారు అండర్–15 విభాగంలో పాల్గొనేందుకు అర్హులన్నారు. 1-9-2005 తర్వాత పుట్టినవారు అండర్–19 విభాగం, 1-9-2001 తర్వాత పుట్టిన వారు అండర్–23 విభాగంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు పుట్టినతేదీ సర్టిఫికెట్, ఆధార్, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్ ఒరిజినల్, జెరాక్స్ కాపీలతో పాటు సొంత కిట్‌తో ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు కోచ్ ఎస్.రమాదేవి, సెల్ 79891 53917లో సంప్రదించాలని సూచించారు.

త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై శిక్షణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో ఏపీ నిట్‌లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై 8, 9,10వ తరగతి విద్యార్థులకు ఐదు రోజుల పాటు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని బుధవారం కార్యక్రమ కో–ఆర్డినేటర్ డాక్టర్ కార్తికేయశర్మ తెలిపారు. జూన్ 3 నుంచి 7 వరకు రోజూ ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. పరిమిత సంఖ్యలోనే విద్యార్థులను తీసుకుంటామని, ఆసక్తి ఉన్నవారు ఈనెల 25లోపు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు శిక్షణ దోహదపడుతుందన్నారు. వివరాలకు సెల్ 99854 57227, 90101 01065 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి ఏపీఈఏపీ సెట్

భీమవరం: జిల్లాలో గురువారం నుంచి ఏపీఈఏపీ సెట్–2024 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. భీమవరంలో 4, తాడేపల్లిగూడెంలో 2, నరసాపురంలో ఒక పరీక్షా కేంద్రం ఏర్పాటుచేశారు. 16,17 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగ పరీక్షలకు 4,087 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. 18 నుంచి 23 వరకు జరిగే ఇంజినీరింగ్ విభాగ పరీక్షలు 9,928 మంది హాజరు కానున్నారు. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అభ్యర్థులను అనుమతించరు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకూ రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

భూసార పరీక్షలకు సన్నద్ధం

- జిల్లాలో 5 వేల భూసార పరీక్షల లక్ష్యం
- ఖరీఫ్ సీజన్‌లో 2.11 లక్షల ఎకరాల్లో సాగు
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- ఎంటీయూ 1318 వంగడానికి మొగ్గు



భూసార పరీక్షలకు మట్టి నమూనాను సేకరిస్తున్న దృశ్యం

ఆకివీడు: దిగుబడులు ఆశాజనకంగా ఉండటం, మద్దతు ధర లభించడంతో రైతులు ఖరీఫ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించారు. గత ఖరీఫ్, రబీ సాగు దిగుబడులు మంచి ఫలితాలను ఇచ్చాయి. ఇదే ఉత్సాహంతో వచ్చే ఖరీఫ్ సాగుకు జిల్లాలో రైతులు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 2.11 లక్షల ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా జిల్లా అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచారు. ఈ నెలాఖరు నాటికి రబీ మాసూళ్లు పూర్తి కానున్నాయి. ఇప్పటికే జిల్లాలో మాసూళ్లు పూర్తయిన ప్రాంతాల్లో రైతులు పచ్చిరొట్ట సాగు చేపట్టారు. దీని ద్వారా భూసారం పెరిగే అవకాశం ఉంది.

భూసార పరీక్ష.. పంటకు రక్ష

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు సాధించేలా యంత్రాంగం దృష్టి పెట్టింది. జిల్లాలో 5 వేల మట్టి నమూనాలు సేకరించి వాటిని పరీక్షించే దిశలో ముందుకు వెళుతున్నారు. ఇప్పటికే ఆయా మండలాల్లోని గ్రామాల్లో భూసార పరీక్షలు నిర్వహించే సర్వే నంబర్లను గుర్తించారు. నెలాఖరులోపు శాంపిల్స్ సేకరించి, పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. జూన్ రెండో వారం నాటికి భూసార పరీక్షా ఫలితాల్ని ఆయా రైతులకు తెలియజేస్తారు. భూమిలో చౌడు, ఆమ్ల గుణాల స్థాయిని నిర్ధారించి, సంబంధిత భూముల్లో సాగు చేయబోయే పంటలకు ఏఏ ఎరువులను వినియోగించాలో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు తెలియజేస్తారు. తద్వారా భూసారాన్ని పెంచి, పంటలకు మంచి పోషకాల్ని అందజేసేందుకు కృషి చేస్తారు. మట్టి పరీక్షలతోనే పంటలకు సరైన బలాన్ని అందించి, అధిక దిగుబడుల దిశగా సాగును తీసుకువెళుతున్నారు.

చౌడు, ఉప్పునీటిని తట్టుకునే సాగు

పశ్చిమ డెల్టాలో రొయ్యల సాగుకు ఉపయోగించే ఉప్పునీరు (సెలనిటీ) శాతం అధికంగా ఉన్న ప్రాంతాల్లో భూసారం క్షీణిస్తుంది. ఉప్పుటేరు, ఇతర ప్రాంతాల్లో చౌడు భూములు అధికంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో చౌడును, సెలినిటీని తట్టుకుని సాగు చేసుకునేలా వరి వంగడాలు అందుబాటులో ఉన్నాయి. మచిలీపట్టణం వరి పరిశోధనా కేంద్రానికి చెందిన ఎంసీఎం 100 వంగడం చౌడు, సెలినిటీని తట్టుకుని దిగుబడులు ఇస్తుంది. మార్టేరు వరి పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో కొత్తగా రూపొందించిన వంగడాలు ఎంటీయూ 1273, ఎంటీయూ 1293 మినీకిట్ల దశలో ఉన్నాయి.

ఎంటీయూ 1318పై ఆసక్తి : ఖరీఫ్ సాగుకు ఎంటీయూ 1318 రకం వంగడాన్ని రైతులు ఎక్కువగా సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ రకం వంగడాల్ని విత్తనాల కోసం ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. ఇటీవల స్వర్ణ వంగడాన్ని మళ్లీ అధికంగా సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. స్వర్ణ రకం బియ్యాన్ని స్థానికంగా వినియోగించేందుకు ప్రజలు ఇష్టపడటంతో సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో పాటు ప్రైవేట్ విత్తనం సంపద స్వర్ణ వంగడాన్ని కూడా సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ విత్తన శాంపిల్స్ పరీక్షలను వ్యవసాయశాఖ అధికారులు చేపట్టనున్నారు.

ప్రణాళికాబద్ధంగా ఖరీఫ్ సాగు



ఖరీఫ్ సాగును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు భూసార పరీక్షలతో పాటు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాల పరీక్షలకు శాంపిల్స్ సేకరణను త్వరలో చేపడతాం. ఖరీఫ్‌కు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయి. రబీ మాసూళ్లు పూర్తయిన వెంటనే ప్రణాళికాబద్ధంగా ఖరీఫ్ సాగుకు వెళతాం.

– జెడ్.వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ జేడీ, పశ్చిమగోదావరి జిల్లా

మూడంచెల భద్రత



స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పోలీసులు

ఉండి: సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లకు చేర్చి మూడంచెల పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య బుధవారం తెలిపారు. వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు జరుగనున్న దృష్ట్యా ఇంకా 19 రోజుల వ్యవధి ఉందన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూములకు కట్టుదిట్టంగా భద్రత ఏర్పాటు చేశామని, స్థానిక పోలీసులతో పాటు కేంద్ర సాయుధ బలగాలు పహారా కాస్తున్నాయన్నారు. అగ్నిప్రమాదాలకు అవకాశం లేకుండా అగ్నిమాపక అధికారులు సైతం అందుబాటు ఉంటారన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఒక సీఐ, నలుగురు ఎస్సైలతో పాటు ఇతర సిబ్బందితో 24 గంటలు విధులు నిర్వర్తిస్తున్నారన్నారు.

స్ట్రాంగ్‌రూమ్స్ వద్ద పటిష్ట బందోబస్తు



అజిత, జిల్లా ఎస్పీ

భీమవరం: జిల్లావ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎం బాక్సులను భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచినట్టు జిల్లా ఎస్పీ అజిత బుధవారం తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏర్పాటుచేసిన మూడంచెల కేంద్ర పోలీస్ బలగాలు, జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్, సివిల్ పోలీస్ బందోబస్తును పరిశీలించి ఆమె సూచనలు, ఆదేశాలను జారీ చేశారు. స్ట్రాంగ్ రూమ్స్‌కు నలువైపులా పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటుచేశామని, నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని, 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ అప్రమత్తంగా ఉండాలని, చిన్నపాటి అవాంఛనీయ సంఘటనలకు కూడా తావు ఇవ్వరాదన్నారు. జిల్లాలోని పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతూ సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

సంప్రదాయబద్ధంగా అతిరాత్ర మహాయాగం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ ఉమా రామలింగేశ్వర ట్రస్టు (నెలమూరు) ఆధ్వర్యంలో 11 రోజుల పాటు జరిగే రాజా శ్యామల దశమహా విద్య సహిత అతిరాత్ర మహాయాగాన్ని బుధవారం భీమవరం డీఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో ఘనంగా ప్రారంభించారు. డీఎన్నార్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నరసింహరాజు, గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు), ఉమా రామలింగేశ్వర వేద పాఠశాల జంధ్యాల నివాస సుబ్రహ్మణ్యశర్మ, ప్రవచనకర్త గజల్ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి యాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహరాజు, గాదిరాజు బాబు మాట్లాడుతూ 76వ యాగం భీమవరంలో నిర్వహించడం ఈ ప్రాంతానికి సుభిక్షమన్నారు. 11 రోజులపాటు 26 మంది రుత్వికులచే 4 విభాగాల్లో యాగాలు నిర్వహిస్తామని, ఈనెల 25న శౌత్ర స్మార్త పుత్రకామేష్టి యాగంతో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. అందరూ భాగస్వాములు కావాలని కోరారు. యాగ పర్యవేక్షకులు చెరుకువాడ రంగసాయి, కాంతేటి వెంకటరాజు, ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, గోకరాజు పాండు రంగరాజు, కొత్తపల్లి శివరామరాజు, గన్నాబత్తుల శ్రీనివాస్, కనుమూరి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



యాగాన్ని ప్రారంభిస్తున్న పండితులు

బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు

18 నుంచి చిన వెంకన్న కల్యాణోత్సవం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల క్షేత్రంలో చిన వెంకన్న వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఈనెల 18 నుంచి 25 వరకు జరుగనున్న శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా 22న రాత్రి స్వామివారి కల్యాణం, 23న రాత్రి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని జరుగుతున్న ఏర్పాట్లలో భాగంగా ఆలయ పరిసరాలను, దర్శనం క్యూలైన్లను సిబ్బంది రంగులతో ముస్తాబు చేస్తున్నారు. అలాగే స్వామివారి పాదుకా మండప ప్రాంతంలో, ఆలయ ధ్వజస్తంభం వద్ద తాటాకు పందిళ్లను నిర్మిస్తున్నారు. అలాగే గుడి సెంటర్‌లోని ప్రధాన కూడలిలో 40 అడుగుల శ్రీవారి భారీ విద్యుత్ కటౌట్‌ను నిర్మిస్తున్నారు. మరో రెండు రోజుల్లో విద్యుద్దీప అలంకారాలు, ఇతర పనులు పూర్తి కానున్నాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు కోరారు.



ఆలయ ప్రధాన కూడలిలో ఏర్పాట్లు

క్షేత్రంలో గో దత్తత పథకం



శ్రీవారి గోసంరక్షణ శాలలో గోవులు

ద్వారకాతిరుమల: ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు ద్వారకాతిరుమల శ్రీవారి గో దత్తత పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు కోరారు. ద్వారకాతిరుమలలోని కొండపైన గోసంరక్షణ శాలలో గతనెల 24న గో దత్తత పథకాన్ని పునః ప్రారంభించినట్టు చెప్పారు. గోవులను స్వీకరించదలచిన ప్రకృతి వ్యవసాయ రైతులు పొలం పట్టాదారు పాస్ పుస్తకం జెరాక్స్, రూ.100 స్టాంప్ పేపర్, ఆధార్ కార్డు జెరాక్స్, నివాస ధ్రువీకరణపత్రంతో గోసంరక్షణ శాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ 99891 09349లో సంప్రదించాలని కోరారు.

144 సెక్షన్ పొడిగింపు

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ముగిసే జూన్ 6వ తేదీ వరకు 144వ సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలో పోలింగ్ అనంతరం కొన్ని ప్రాంతాల్లో శాంతి భద్రతలకు అవాంతరం కలిగే అవకాశం ఉన్నందున ఈనెల 14 వరకు ఉన్న 144 సెక్షన్‌ను జూన్ 6 వరకు పొడిగించామన్నారు. చట్టవిరుద్ధమైన సమావేశాలు, బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించడం నిషేధమని పేర్కొన్నారు.

ఎండు గడ్డికి యమ గిరాకీ

- యంత్రాల ద్వారా మాసూళ్లు
- గడ్డిని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు
- కట్టలు కట్టి వినియోగిస్తున్న వైనం



యంత్రంతో వరి గడ్డిని కట్టలు కట్టిన దృశ్యం



వరి చేలలో గడ్డిని కట్టలు కడుతున్న యంత్రం

భీమవరం: జిల్లాలో వరి సాగు కొంతపుంతలు తొక్కుతోంది. రైతులు ఎక్కువగా యంత్రాలను ఉపయోగిస్తున్నారు. చేలలో దుక్కుదున్నడం, గట్టు లంకలు వేయడం నుంచి వరి నాట్లు, పురుగుల మందుల పిచికారీ, మాసూళ్లు, ఎండుగడ్డిని కట్టలు కట్టించడం వరకు యంత్రాలపై ఆధారపడుతున్నారు. ప్రస్తుతం ఎండు గడ్డిని గిరాకీ ఉండటంతో రైతులు గడ్డిని ఒబ్బిడి చేసి విక్రయిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. జిల్లాలో సుమారు 2.19 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా దాళ్వా సీజన్‌లో కోతలు దాదాపు పూర్తికావచ్చాయి. యంత్రాల ద్వారా మాసూళ్లతో గడ్డి ముక్కలుగా మారుతుంది. దీనిని యంత్రం సాయంతోనే ఒబ్బిడి చేయించి కట్టలు కట్టించి విక్రయిస్తున్నారు.

కట్టకు రూ.35 ఖర్చు

యంత్రాల ద్వారా మాసూళ్లు చేసిన వరి పంటలో ఎండు గడ్డిని కూలీలతో మోపులు కట్టించి గడ్డివాములు వేయడానికి ఎక్కువ ఖర్చు అవుతుండటంతో రైతులు గడ్డి కట్టలు కట్టడానికీ యంత్రాలను ఉపయోగిస్తున్నారు. చేలలోని గడ్డిని ప్రత్యేక యంత్రం ద్వారా కట్టలు కట్టించి ట్రాక్టర్స్‌తో గట్టుకుచేర్చి గడ్డివాములుగా వేస్తున్నారు. యంత్రం ద్వారా కట్టలు కట్టడానికి ఒక్క కట్టకు రూ.35 వసూలు చేస్తున్నారు. దీంతో యంత్రం ద్వారా ఎకరా గడ్డి ఒబ్బిడి చేయడానికి సుమారు రూ.2 వేలు ఖర్చవుతుందని రైతులు అంటున్నారు. ఇతర జిల్లాల్లో గడ్డిని కొనుగోలు చేసే కంటే స్థానికంగా ఉన్న గడ్డిని ఒబ్బిడి చేసుకుని విక్రయించడమే మేలంటున్నారు.

సుమారు 2.50 లక్షల పశువులు : రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతులు పశువుల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో సుమారు 45,539 ఆవు జాతి పశువులు, 1,78,137 గేదె జాతి పశువులు ఉన్నట్టు అంచనా. పశువుల సంఖ్య పెరగడంతో వరి గడ్డికి డిమాండ్ పెరిగింది. దీంతో కోత యంత్రాలతో మాసూళ్లు చేసిన వరి గడ్డిని పశు దాణాగా వినియోగిస్తున్నారు. యంత్రాలతో మాసూళ్ల తర్వాత గడ్డిని చేలలోనే నాలుగైదు రోజులు ఎండబెట్టి తర్వాత ప్రత్యేక యంత్రాలతో కట్టలు కట్టించి వాములుగా వేసి దాణాగా ఉపయోగిస్తున్నారు.

పోషక విలువలు తగ్గవు



వరికోత యంత్రాల ద్వారా మాసూళ్లు చేసిన వరి గడ్డిలో ఏమాత్రం పోషక విలువలు తగ్గవు. గడ్డి పొడవుగా కాకుండా చిన్న ముక్కలుగా ఉండటం వల్ల పశువులు సులభంగా తినగలుగుతాయి. అందువల్ల రైతులు పశువులకు గడ్డి వాడకంలో ఎటువంటి సంకోచం లేకుండా వినియోగించవచ్చు.

– కె.మురళీకృష్ణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, భీమవరం

మాసూళ్లు చేసిన గడ్డినే..



గడ్డికి తీవ్ర కొరత ఏర్పడటంతో యంత్రాల ద్వారా మాసూళ్లు చేసిన పంటలోని గడ్డిని మరో యంత్రంతో కట్టలు కట్టించి వాముగా వేసి పశువులకు ఉపయోగిస్తున్నాం, గడ్డి కట్టలు కట్టడానికి కట్టకు రూ.35 తీసుకుంటున్నారు. ఈ గడ్డిని పశువులు సులభంగా తినగలుగుతున్నాయి.

– పంజా శేషగిరిబాబు, రైతు, ముగ్గుళ్ల

స్వీప్‌తో సత్ఫలితం

- పోటెత్తిన ఓటరు చైతన్యం
- అధికారుల కార్యక్రమాలతో పెరిగిన పోలింగ్
- ఎన్నికల కమిషన్ నుంచి అభినందనలు



సంప్రదాయ వస్త్రధారణలో ఓటర్లకు స్వాగతం పలుకుతున్న అధికారులు (ఫైల్)

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో నిర్వహించిన ఓటరు అవగాహన చైతన్య కార్యక్రమాలు (స్వీప్) సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఓటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచేందుకు దోహదపడ్డాయి. 2019 సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో 79.77 శాతం పోలింగ్ శాతం నమోదు కాగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో భాగంగా ఉన్న ప్రస్తుత ఏలూరు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 83.67 ఓటింగ్ శాతం నమోదు కాగా ప్రస్తుత ఎన్నికల్లో తుది గణాంకాలు సంకలనం పూర్తయ్యేసరికి పోస్టల్ బ్యాలెట్‌తో కలిసి దాదాపు 84.82 శాతానికి ఓటింగ్ పెరిగింది.

90 రోజులు నిర్విరామంగా..

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ గత ఎన్నికల పోలింగ్ శాతాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచే లక్ష్యంగా జిల్లాలో 90 రోజులు నిర్విరామంగా ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఓటర్స్ టర్న్‌అవుట్ ఇంప్లిమెంటేషన్ ప్రణాళికను ఆమోదించి స్వీప్ నోడల్ ఆఫీసర్‌గా జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్‌ను నియమించి కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించారు. ఓటర్లలో చైతన్య అవగాహన కార్యక్రమాలు, ఓటు హక్కు ప్రాధాన్యత, గిరిజన, గ్రామీణ ప్రాంత ఓటర్లలో, బూత్ స్థాయిలో అసోషియేషన్ గ్రూపుల ఏర్పాటు, కళాశాల విద్యార్థులతో క్యాంపస్ అంబాసిడర్లు వంటి కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. మహిళా సంఘాలతో చర్చావేదికలు, మొదటిసారిగా ఓటు హక్కు నమోదుచేసుకున్న ఓటర్లతో ముఖాముఖీ కార్యక్రమాలు, ఓటు వేయాలని ప్రత్యేక ఆహ్వాన పత్రిక ద్వారా పిలుపు జిల్లాలో పోలింగ్ శాతం పెరగడానికి దోహదపడ్డాయి. అలాగే ఇంటింటికీ కరపత్రాల పంపిణీ, సీ–విజిల్, సాక్ష్యం యాప్, 1950 టోల్‌ఫ్రీ నంబర్, జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో మోడల్ పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, వృద్ధాశ్రమాల్లో 'హోం ఓటింగ్'పై అవగాహన కల్పించడం, పోలీస్ కవాతులు వంటివి నిర్వహించారు. స్వీప్ కార్యక్రమాల్లో కళాశాల విద్యార్థులు, మహిళా సంఘాలు, ఉపాధి హామీ కార్మికులు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సంప్రదాయ దుస్తులతో స్వాగతం

పోలింగ్ రోజు స్వీప్ నోడల్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ బృందం తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులలో పోలింగ్ కేంద్రాల వద్ద మహిళా ఓటర్లను ఘనంగా స్వాగతించడం, ఓటు వేసిన ప్రతి ఓటరుకు 'గో గ్రీన్' అనే నినాదంతో పచ్చని మొక్కలు ఇచ్చి వీడ్కోలు పలకడం జిల్లా ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంది.

కొల్లేరు చుట్టూనే రాజకీయం

- అభ్యర్థుల జయాపజయాల్లో కీలకం కానున్న లంకగ్రామాలు
- లంక గ్రామాల్లో పెరిగిన ఓట్లు.. పెద్దల కట్టుబాట్లు పనిచేసేనా
- ఎమ్మెల్సీ జయమంగళ కొల్లేరు గ్రామాల్లో విస్తృత ప్రచారం
- కొల్లేరు మిగులు భూములపై హామీ ఇచ్చిన సీఎం జగన్


కొల్లేరులో సంప్రదాయ వేట


కొల్లేరు గ్రామాల్లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ (ఫైల్)

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు జిల్లాలో కొల్లేరు గ్రామాల ఓట్లు కీలకంగా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇక్కడ పోటీల్లో ఉన్న అభ్యర్థుల జయాపజయాలపై లంక గ్రామాల ఓటర్లు ప్రభావం చూపనున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొల్లేరు గ్రామాల్లో అందరికీ సంక్షేమ పథకాలు దక్కాయి. గ్రామాల్లో సచివాలయం, హెల్త్ క్లినిక్, ఆర్బీకే సెంటర్లను ఏర్పాటు చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ ధరను రూ.1.50కి తగ్గించారు. రెగ్యులేటర్ల నిర్మాణానికి రూ.412 కోట్లను కేటాయించారు. వడ్డీల కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ టీడీపీ మండల ఇన్‌చార్జిగా ఉన్న జయమంగళ వెంకటరమణ వైఎస్సార్ సీపీలో చేరి ఎమ్మెల్సీ పదవిని చేపట్టగా, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)తో కలిసి కొల్లేరు గ్రామాల అభివృద్ధికి కృషి చేశారు. ఇవే కాకుండా ఎన్నికల ప్రచారంలో భాగంగా కైకలూరు ఇటీవల వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొల్లేరు సర్వే పూర్తి చేయడం జరిగిందని చెప్పారు. రికార్డులు వచ్చిన తర్వాత కొల్లేరులో మిగులు భూములను పేదలకు పంపిణీ చేస్తామన్నారు. భూముల పంపిణీకి స్వయంగా తానే హాజరవుతానని హామీ ఇవ్వడంతో కొల్లేరు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కొల్లేరు గ్రామాల ఓటర్లు ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ వైపు మొగ్గు చూపారని విశ్లేషకులు చెబుతున్నారు.

పునర్విభజనలో ఒకే గూటికి కొల్లేరు

జిల్లాల పునర్విభజనలో భాగంగా పూర్వ కృష్ణా జిల్లా నుంచి కైకలూరు నియోజకవర్గం చేరడంతో దాదాపు కొల్లేరు మొత్తం ఒకే గూటికి చేరింది. ఇంతవరకు పశ్చిమగోదావరిలో దెందులూరు, ఉండి, ఉంగుటూరు, పెదపాడు, ఏలూరు, నిడమర్రు, భీమడోలు, కృష్ణా జిల్లాలో కైకలూరు, మండవల్లి మండలాలు ఉండేవి. వీటిలో ఒక్క ఉండి మండలం మినహా మిగతావన్నీ ఏలూరు జిల్లాలో కలిపేశారు. దీంతో ఏలూరు పార్లమెంటు పరిధిలో కొల్లేరు గ్రామాల ఓట్లు కీలకంగా మారాయి.

122 గ్రామాల్లో 1.70 లక్షల మంది ఓటర్లు

ఏలూరు జిల్లాలో 77,138 ఎకరాల విస్తీర్ణంలో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. మొత్తం 122 కొల్లేరు పరివాహక గ్రామాల్లో 82 వేల కుటుంబాలకు చెందిన దాదాపు 3లక్షల 30 వేల మంది నివసిస్తున్నారు. కొల్లేరు పరివాహక ప్రాంతాల్లో దాదాపు లక్షా 70 వేల మంది ఓటర్లు ఉన్నారు.

కుల కట్టుబాట్లు పనిచేసేనా?

కొల్లేరు గ్రామాల్లో పెద్దల కట్టుబాట్లు కనిపిస్తాయి. గత ఎన్నికలను పరిశీలిస్తే 2009లో టీడీపీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణకు 11,857 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి యెర్నేని రాజారామచందర్‌కు 1,985 ఓట్లు మాత్రమే వచ్చాయి. తర్వాత 2014 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు 10,582 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి వైఎస్సార్ సీపీకి చెందిన ఉప్పాల రాంప్రసాద్‌కు 4,673 ఓట్లు పడ్డాయి. ఇక 2019 ఎన్నికల్లో తిరిగి కొల్లేరు గ్రామాల సామాజికవర్గానికి చెందిన జయమంగళ వెంకటరమణకు టీడీపీ సీటు కేటాయించింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) 9,357 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ విధంగా కొల్లేరు ఓట్లు అభ్యర్థుల విజయంలో కీలకంగా మారుతున్నాయి.

కొల్లేరులో ఓట్లు సరళి ఇలా..

కైకలూరు నియోజకవర్గంలో కైకలూరు మండలంలో నత్తగుళ్లపాడు, చటాకాయి, శృంగవరప్పాడు, గుమ్మళ్ళపాడు, పందిరిపల్లిగూడెం, కొట్టాడ, పెంచికలమర్రు, మండవల్లి మండలంలో ఇంగిలిపాకలంక, పెనుమాకలంక, కొవ్వాడలంక, చింతపాడు, పులపర్రు వంటి కొల్లేరు గ్రామాలు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో రెండు మండలాల్లో కొల్లేరు గ్రామాల ఓట్లు 19,896 ఉండగా 17,995 పోలయ్యాయి. ప్రస్తుత 2024 సార్వత్రిక ఎన్నికల్లో కొల్లేరు గ్రామాల ఓట్లు 20,667 ఉండగా 18,154 ఓట్లు పోలయ్యాయి. దాదాపు 771 మంది ఓటర్లు పెరిగారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొల్లేరు సామాజికవర్గానికి చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణకు ఎమ్మెల్సీ కేటాయించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి ఆయన ప్రచారం చేశారు. ఇక కైకలూరు మండలం చటాకాయి గ్రామంలో 2009 ఎన్నికల్లో పీఆర్పీ అభ్యర్థి కామినేనికి కేవలం 2 ఓట్లు వచ్చాయి. 2014 ఎన్నికల్లో కామినేనికి ఇదే గ్రామం నుంచి 826 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాంప్రసాద్‌కు కేవలం 8 ఓట్లు వచ్చాయి. ఇక 2019 ఎన్నికల్లో ఇదే చటాకాయి గ్రామం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావుకు కేవలం 6 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ విధంగా కొల్లేరు గ్రామాల ఓటింగ్ సరళి ఉంటోంది.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ విజయం నల్లేరుపై నడకే


భీమవరంలో మాట్లాడుతున్న మంగరాజు

భీమవరం: సార్వత్రిక ఎన్నికల్లో భీమవరం అసెంబ్లీ నియోజకవర్గంలో గ్రంధి శ్రీనివాస్ విజయం నల్లేరుపై నడకేనని, ఓటింగ్ సరళిని చూస్తుంటే శ్రీనివాస్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం భీమవరంలోని మాలమహానాడు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పైనే శ్రీనివాస్ సునాయాసంగా విజయం సాధించారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నో జిమ్మిక్కులు చేసి అబద్ధపు ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మకుండా స్వచ్ఛందంగా పోలింగ్ బూత్‌లకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారన్నారు. నాయకులు పొన్నమండ బాలకృష్ణ, సీహెచ్ గోపి, బి.సునీల్‌బాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాపీ కూలీ మృతి


అన్నవరం మృతదేహం

తణుకు: తణుకు పరిధిలోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు గ్రామానికి చెందిన ఈతకోట అన్నవరం (41) తాపీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. పని నిమిత్తం మోటారు సైకిల్‌పై తణుకు వస్తుండగా జాతీయ రహదారిపై పాత బెల్లంమార్కెట్ సమీపంలో మోటారు సైకిల్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. అతనిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అన్నవరం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

భీమవరం అర్బన్: పాత గొడవల నేపథ్యంలో బుధవారం జరిగిన కొట్లాటపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై జి.రాజు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. కరుకువాడ బేతపూడి గ్రామానికి కొల్లి నాగసత్యవతి, భర్త శ్రీనివాస్ ఇద్దరు పిల్లలతో భీమవరంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఈ నెల 13 ఎన్నికలకు ఓట్లు వేయడానికి తన సొంత గ్రామానికి వచ్చింది. ఈ నెల 14న నాగసత్యవతికి అన్నయ్య రావుల ఆదినారాయణ, మేనత్తకు బంగారం విషయమై మళ్లీ ఇరువర్గాలు కొట్లాడుకున్నాయి. గాయాలపాలైన ఇరువర్గాలవారు పరస్పరం ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకోవడంతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు దురదృష్టకరం


కొవ్వలిలో గొతికల నాగభూషణాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు : ఎన్నికల్లో ఓటమి భయంతో చింతమనేని, టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడి చేయడం దురదృష్టకరమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం కొవ్వలిలో టీడీపీ శ్రేణుల దాడిలో తీవ్రంగా గాయపడిన సొసైటీ డైరెక్టర్ గొతికల నాగభూషణంను ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామంలో గాయపడిన కనకరాజును పరామర్శించారు. దాడి చేసిన వారిని, సహకరించిన వారిని, ప్రేరేపించిన వారిని చట్టం వదిలిపెట్టదనిన్నారు. దాడులు, దౌర్జన్యాలు చేస్తే తలరాత మారదని, టీడీపీ శ్రేణులు గమనించాలన్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, సర్పంచ్ ఇంటేటి మధులత, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి, నాయకులు సోమేశ్వరరావు, పోలయ్య ఉన్నారు. దెందులూరులో ఇటీవల మృతి చెందిన కట్టా సుకాలు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. దెందులూరులో టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు లెర్డి శివ, కిషోర్‌లను ఎమ్మెల్యే పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. గ్రామ కమిటీ అధ్యక్షులు పోకల రాంబాబు, జిల్లా కార్యదర్శులు చల్లా మేరిరాజు, కట్టా ఏసుబాబు, ఏఎంసీ డైరెక్టర్ పి.శ్యామలాదేవి, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, ఎంపీటీసీలు తాళ్లూరి నాగరాజు, తోట విజయకుమారి, మండల యువజన విభాగ అధ్యక్షులు గొరిపర్తి శ్రీనివాసరావు ఉన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో భవన్స్ విద్యార్థుల ప్రతిభ


తరుణ్‌కుమార్ పాండా


వేగిరాజు సాయి అన్విత


కనుమూరి శ్రావ్య


బల్ల పవన్ నాగ వెంకటసాయి


ఎస్.రంజని


పెన్మెత్స అక్షర

భీమవరం: సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో భారతీయ విద్యాభవన్స్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని స్కూల్ చైర్మన్ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, సెక్రటరీ యూకే విశ్వనాథరాజు, ప్రిన్సిపాల్ ఎల్‌వీ రమాదేవి చెప్పారు. బుధవారం భీమవరంలో ఫలితాల వివరాలను వెల్లడించారు. పశ్చిమ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని తమ స్కూల్స్‌లో టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు 98 శాతం పర్సంటేజీతో ప్రథమస్థానంలో నిలిచారన్నారు. సీబీఎస్ఈ టెన్త్ పరీక్షల్లో 490 మార్కులతో తరుణ్ కుమార్ పాండా ప్రథమస్థానంలో నిలవగా, వేగిరాజు సాయిఅన్విత 475 మార్కులతో ద్వితీయ, కనుమూరి శ్రావ్య, దండు శ్రీచైతన్యవర్మ ఇద్దరూ 474 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో బల్ల పవన్ నాగ వెంకట సాయి 574 మార్కులు, ఎస్.రంజని 546 మార్కులు, పెన్మెత్స అక్షర 540 మార్కులు సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను శ్రీరంగనాథరాజు, విశ్వనాథరాజు, భవన్స్ వైస్ చైర్మన్ బీహెచ్ అచ్యుతరామరాజు, జిల్లా రైస్ మిలర్స్ అసోసియేషన్ చైర్మన్ సామంతపూడి శ్రీరామరాజు, కోశాధికారి కొత్త శ్రీనివాస్ అభినందించారు.

17 నుంచి కొంతేరులో నాటికల పోటీలు


కొంతేరులోని పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిరం

యలమంచిలి : కొంతేరు గ్రామంలోని పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిరంలో ఈ నెల 17, 18, 19 తేదీలలో 42వ వార్షిక అఖిల భారత స్థాయి నాటిక పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు యూత్ క్లబ్ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నాటిక పోటీల ప్రదర్శనలకు ఏడు నాటికలను ఎంపిక చేసినట్లు తెలిపారు. తొలి ప్రదర్శనగా కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ వారిచే కౌసల్యా సుప్రజా రామా, మలి ప్రదర్శనగా చిలకలూరిపేట సుకృతి క్రియేషన్స్ వారిచే 'మిణుగురు వెలుగులు' ప్రదర్శిస్తామన్నారు. రెండో రోజు నెల్లూరి శ్రీక్రాంతి ఆర్ట్స్ థియేటర్స్ వారిచే 'ఓ మనిషి కావాలి', రెండవ ప్రదర్శనగా అనకాపల్లి శ్రీ షిర్డీ సాయి కల్చరల్ క్రియేషన్స్ వారిచే 'మలి సంధ్య', మూడవ ప్రదర్శనగా శ్రీకాకుళం శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య వారిచే 'ఆసరసాల' నాటికలు ప్రదర్శిస్తారన్నారు. మూడో రోజు హైదరాబాద్ శ్రీయువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ వారిచే 'బూడిద', రెండవ నాటికగా గుడివాడ శ్రీ కృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ వారిచే 'మళ్లీ కలిసి జీవిద్దాం' నాటికలు ప్రదర్శిస్తామని మురళీకృష్ణ వివరించారు. నాటిక ప్రియులంతా పెద్ద సంఖ్యలో హాజరై ప్రదర్శనలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

జాతీయ నైపుణ్య పోటీలకు ఐటీఐ విద్యార్థి


కాట్రు సిద్దు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వట్లూరులోని ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్ ట్రేడ్ విద్యార్థి కాట్రు సిద్దు త్వరలో జాతీయ స్థాయిలో జరుగనున్న నైపుణ్య పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ పి.రజిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన నైపుణ్య పోటీల్లో విజేతగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు న్యూఢిల్లీలోని యశోభూమి ఎక్స్‌పో సెంటర్‌లో జరిగే జాతీయ నైపుణ్య పోటీల్లో సిద్దు పాల్గొననున్నట్లు వివరించారు.

యువకుడిపై దాడి.. ముగ్గురి అరెస్టు

ఏలూరు టౌన్: నగరంలోని కొత్తపేట గాడివారి వీధిలో ఓ యువకుడిపై దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తపేట గాడివారి వీధిలో చీపుల్ల గణేష్ అనే యువకుడితో లీలాసాయి, చిన్ని, అనిల్ అలియాస్ మచ్చ అనే ముగ్గురు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో గణేష్‌కు మెడపై గాయం కావటంతో ఇరువర్గాల వారు హాస్పిటల్ వద్దకు చేరటంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బాధితులు కత్తితో దాడి చేశారంటూ హాస్పిటల్ వద్ద నిరసనకు దిగారు. దీనిపై వెంటనే స్పందించి హాస్పిటల్ వద్ద వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్, ఎస్ఐలు సాధిక్, భాషా, పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయటంతోపాటు, ఘటనా స్థలంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఇరు వర్గాల వారు ఎలాంటి గొడవలకు పాల్పడకుండా చర్యలు చేపట్టారు. గణేష్‌పై కత్తితో దాడి చేయలేదని, ఘర్షణలో అతని మెడపై గాయం అయ్యిందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని సీఐ స్పష్టం చేశారు. నగరంలో అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అతిసారకు గురై మహిళ మృతి

- 9 మంది గిరిజనులకు అస్వస్థత
- కరుములతోగు గ్రామంలో ఘటన


కురుములతోగులో మృతి చెందిన కారం బొజ్జమ్మ

కుక్కునూరు: మండలంలోని కురుములతోగు గ్రామంలో అతిసారకు ప్రబలి ఓ మహిళ మృతి చెందగా, మరో తొమ్మిది అస్వస్థతకు గురయ్యారు. వివరాలిలా ఉన్నాయి. దామరచర్ల పంచాయతీ కురుములతోగు అటవీ ప్రాంతంలో గత కొన్ని సంవత్సరాలుగా ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ నుంచి వలస వచ్చిన గుత్తి కోయ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాగా, గత రెండు రోజులుగా గ్రామంలో పలువురు అతిసార వ్యాధికి గురై వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారు. వారిలో కారం బొజ్జమ్మ (45) అనే మహిళ మృతి చెందింది. గ్రామ పెద్దలు ఈ విషయాన్ని సీపీఐఎంఎల్ ప్రజాపంథా (మాస్‌లైన్) దృష్టికి తీసుకువెళ్లడంతో వారు స్థానిక విలేకరులకు సమాచారం అందించారు. దీంతో బుధవారం విషయం వెలుగులోకి వచ్చి అమరవరం పీహెచ్‌సీ వైద్యులకు తెలియజేయగా, సిబ్బందితో కలిసి కురుములతోగు గ్రామానికి వెళ్లి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి బాధితులకు వెంటనే చికిత్సను అందించారు. అమరవరం పీహెచ్‌సీ వైద్యులు అనంత్ మాట్లాడుతూ కలుషిత నీటితో పాటు ఫుడ్ పాయిజన్ కావడంతో గిరిజనులు అస్వస్థతకు గురైనట్లు చెప్పారు. సమాచారం అందిన వెంటనే వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి బాధితులకు తగిన చికిత్స అందించామని ప్రస్తుతం బాధితులు కోలుకుంటున్నారని తెలిపారు.

ఎన్నికల విధులు ముగించుకుని తిరిగి వెళుతూ..


ఘటనా స్థలంలో గాయాలతో ఉపాధ్యాయుడు మార్కండేయులు

పాలకొల్లు సెంట్రల్: ఎన్నికల విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై తిరిగి వెళుతూ నిద్రమత్తులో అదుపుతప్పి గాయాలపాలై స్పృహలో లేని స్థితిలో ఉన్న ఓ ఉపాధ్యాయుడిని తోటి ఉపాధ్యాయులు గుర్తించి సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయ స్థితి నుంచి గట్టెక్కారు. వివరాలిలా ఉన్నాయి. నరసాపురానికి చెందిన ఎం.మార్కండేయులు ఎన్నికల విధుల్లో భాగంగా భీమవరంలో ఓటింగ్ యంత్రాలను అప్పగించి మంగళవారం ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరారు. వీరవాసరం గ్రామం సమీపంలోని మురుగుకాలువ వంతెన వద్దకు వచ్చేసరికి నిద్రమత్తులో ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయాలపాలై ఘటనా స్థలంలో స్పృహలేని స్థితిలో ఉండగా, వెనుకే వచ్చిన ఉపాధ్యాయుడు జి.లక్ష్మీనారాయణ, మరికొందరు వెంటనే అతనిని గుర్తించి 108 వాహనంలో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడ నుంచి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఉపాధ్యాయుల సహకారంతో ప్రాణాపాయం నుంచి గట్టెక్కడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు.

సుందరయ్యపై అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి


మాట్లాడుతున్న డీఎన్‌వీడీ ప్రసాద్ తదితరులు

ఏలూరు (టూటౌన్): ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ సుందరయ్య అక్రమ సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని సీఐటీయూ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ కోరారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక సమావేశంలో పాల్గొన్నారనే కారణంతో ఒక పత్రికలో వచ్చిన వార్తను సాకుగా చూపి ఎన్నికల నియమావళి ఉల్లంఘించారనే నెపంతో అధికారులు సస్పెండ్ చేయడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమన్నారు. ఉద్యోగ సంఘాల సమావేశంలో పాల్గొనడం మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ పరిధిలోకి రాదని, ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులకు ఓటు వేయమని ప్రేరేపించడం, రాజకీయ పార్టీల తరుపున ప్రచారం చేయడం మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ పరిధిలోకి వస్తాయన్నారు. దురుద్దేశపూర్వకంగా అధికారులు సుందరయ్యను అక్రమంగా సస్పెన్షన్ చేశారని ఆరోపించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోయినా కుట్ర పన్ని ఇటువంటి చర్యలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు దీనిపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సుందరయ్యను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.జగన్నాథం, వి.సాయిబాబు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడి.. 8 మందికి గాయాలు



కొయ్యలగూడెం: రాజవరం గ్రామంలో బుధవారం పిచ్చికుక్క కరవడంతో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వీరిలో ఒక మహిళ చేతికి తీవ్ర గాయం అయ్యింది. పిచ్చికుక్కను పట్టుకోవడానికి గ్రామస్తులు వెంట పడినప్పటికీ ఫలితం లేకపోయింది. కాగా గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా ప్రజలు తిరగవద్దని గ్రామంలో దండోరా వేయించారు. పంచాయతీ పాలకవర్గం వెంటనే పిచ్చికుక్కను పట్టుకుని తమను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పడాలలో బలుసులమ్మ జాతర



పూరిగుడిసె నుంచి అమ్మవారిని ఆలయానికి తీసుకొచ్చిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల గ్రామంలో వేంచేసియున్న బలుసులమ్మ వారి జాతర మహోత్సవం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారిని గ్రామంలోని పూరిగుడిసె నుంచి ఆలయానికి బ్యాండ్ వాయిద్యాలు, గరగ నృత్యాలతో అంగరంగ వైభవంగా తీసుకొచ్చారు. అమ్మవారికి గ్రామ భక్తులు సాదర స్వాగతం పలికారు. 70 ఏళ్లకొకసారి జరుగుతున్న ఉత్సవాలు కావడంతో గ్రామానికి చెందిన బంధువులు, ఆడపడుచులు పుట్టినింటికి చేరుకున్నారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ నెల 19వ తేది వరకు జాతర నిర్వహించనున్నట్టు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు.

మందాలమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం అందజేత



ఆలయాభివృద్ధికి విరాళం ఇస్తున్న దాతలు

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయాభివృద్ధికి అధిక సంఖ్యలో దాతలు విరాళాలు అందిస్తున్నారని ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం వడలికి చెందిన తమ్మినీడి శాంత కుమారి కుటుంబ సభ్యులు రూ.30,116 విరాళం అందించినట్లు తెలిపారు. ఆలయం వద్ద నిత్యాన్నదాన భవన నిర్మాణంతో పాటు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సమృద్ధిగా మంచినీటి సరఫరా



శ్రీవెంకటరమణ

నరసాపురం: ప్రస్తుత వేసవిలో పట్టణంలో అన్ని ప్రాంతాలకు సమృద్ధిగా కుళాయిల ద్వారా రెండు పూటలా మంచినీటి సరఫరా చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ శుభ్రమైన మంచి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని, నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. కాలువలు వదిలే వరకూ ఏ ఇబ్బంది లేకుండా రెండు పూటలా మంచినీటి సరఫరా జరుగుతుందని చెప్పారు. ఆలం నిల్వలు పరిపడగా ఉన్నాయని వివరించారు. మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులున్నా ఫిర్యాదు చేయాలని సూచించారు.

అమృత్ సరోవర్‌లో చెరువుల అభివృద్ధి

మొగల్తూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన అమృత్ సరోవర్ కార్యక్రమంలో గ్రామాల్లోని చెరువులను అభివృద్ధి చేసే పనులు చేపట్టారు. గతేడాది మండలంలోని మొగల్తూరు, రామన్నపాలెం, శేరేపాలెం, వారతిప్ప, పేరుపాలెం నార్త్ గ్రామాల్లోని 5 చెరువులను రూ.12.62 లక్షలతో తవ్వారు. అయితే రెండో ఏడాది కూడా చెరువులు తవ్వాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే చెరువులో పేరుకుపోయిన మట్టిని తొలగించడం, మరోసారి గట్లు పటిష్టం చేయడం, చెరువు చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, మొక్కలు నాటడం, వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు చేయడం తదితర పనులు చేపడతారు. అంతే కాక వర్షాకాలం ముందు, తరువాత నీటి నాణ్యతను పరిశీలించి అందుకనుగుణంగా తగు చర్యలు తీసుకుంటారు.

పంచాయతీలకు తగ్గనున్న భారం

అమృత్ సరోవర్‌లో పనులు చేపట్టడం ద్వారా పంచాయతీలకు చెరువుల అభివృద్ధి, నిర్వహణా భారం తగ్గుతుంది. మండలంలోని పంచాయతీ చెరువులు, పశువుల చెరువులు, రజకుల చెరువులు కలిపి 200 పైగానే ఉండగా చాలా చెరువులు మట్టితో పూడికపోయాయి. అమృత్ సరోవర్‌లో దశల వారీగా చెరువులను అభివృద్ధి చేయడంతో రానున్న రోజుల్లో చెరువులు జలకళను సంతరించుకుంటాయి.

ఘనంగా కాటన్ జయంతి

నరసాపురం రూరల్: పశ్చిమడెల్టాలో నీటి ఎద్దడిని లేకుండా చేసి రైతులకు అన్నంపెట్టిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని సర్వోదయ రైతు సంఘం నాయకుడు చినిమిల్లి వీరబాబు అన్నారు. బుధవారం సర్ ఆర్థర్ కాటన్ జయంతిని కొప్పర్రు సొసైటీ ఆవరణలో నిర్వహించారు. కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతులు వీరబాబు, ముక్కు గణపతి తదితరులు మాట్లాడుతూ కాటన్‌ను ఇక్కడి ప్రజలు దేవుడిగా కొలుస్తారన్నారు. అనంతరం రైతుల సంక్షేమం కోసం ఆయన చేసిన త్యాగాలను, పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో పోలిశెట్టి సత్తిబాబు, కదిలి సత్యానారాయణ, బద్ద బుజ్జి, చెల్లబోయిన శివ తదితరులు పాల్గొన్నారు.

ఓటెత్తిన మహిళా లోకం

- నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 82.12 శాతం పోలింగ్
- మొత్తం ఓటర్లు 2,34,575, పోలైన ఓట్లు 1,92,627
- వైఎస్సార్ సీపీకే అనుకూలమని విశ్లేషకుల అంచనా



ఓటు వేసేందుకు క్యూ కట్టిన మహిళా ఓటర్లు (ఫైల్)

తణుకు: మూడు రోజుల క్రితం తణుకు నియోజకవర్గంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలు మరోమారు అధికార పార్టీకు పట్టం కట్టనుందా..? పోలింగ్ శాతం పెరగడమే ఇందుకు కారణమా..? పురుషులతో పోలిస్తే మహిళలు పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనడం ప్రభుత్వానికి సానుకూలతేనా..? మరోమారు వైఎస్సార్ సీపీకు పట్టం కట్టడానికి ఇవి సంకేతాలా..? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఎప్పుడూ లేనివిధంగా తణుకులో పోలింగ్ 82 శాతం దాటడం కొత్త రికార్డును సృష్టించింది. ఇది ముమ్మాటికీ వైఎస్సార్ సీపీ పార్టీకి అనుకూలమేనని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

పెద్ద సంఖ్యలో ఓటర్లు...

మామూలుగా చూసినట్లయితే పోలింగ్ జరిగే సమయంలో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఓ మోస్తరుగా ఓటర్లు క్యూ కడుతారు. దాని తర్వాత సాయంత్రానికి గానీ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రారు. అయితే సోమవారం జరిగిన పోలింగ్ ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కూడా చాలా కేంద్రాల్లో క్యూలు కనిపించాయి. ఇంకా చెప్పాలంటే తణుకు మండలం తేతలి, దువ్వ గ్రామాల పరిధిలో ఓటర్లు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. తణుకు పట్టణంలో సైతం పలు కేంద్రాల్ల రాత్రి 10 గంటల వరకు పోలింగ్ జరిగింది. తణుకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం 6 గంటల వరకు క్యూలలో ఉన్న ఓటర్ల వారి ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం కల్పించారు.

పెరిగిన శాతం...

2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ 2 శాతం పోలింగ్ పెరిగింది. ఈసారి జరిగిన ఎన్నికల్లో తణుకు నియోజకవర్గ పరిధిలో 2,34,575 మంది ఓటర్లు ఉంటే 1,92,627 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 98,644 మంది మహిళలు కాగా 93,979 మంది పురుషులు, నలుగురు ఇతరులు ఉన్నారు. పూర్తిస్థాయి పోలింగ్ ముగిసాక.. తణుకు నియో వజకవర్గంలో 82.12 శాతం ఓటింగ్ నమోదైందని ఎన్నికల అధికారులు ప్రకటించారు.

×ఆమె₹ కీలకం...

తణుకులో పోలింగ్ శాతం పెరగడంపై సానుకూల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందులోనూ మహిళా ఓటర్లు పోటెత్తడం ఇక్కడ అభ్యర్థి గెలుపులో కీలకపాత్ర పోషిస్తారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. ఎండలను సైతం లెక్కచేయకుండా క్యూలలో వేచి ఉండి మరీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే మహిళలు పెద్ద సంఖ్యలో రావడం వెనుక.. ప్రభుత్వం నుంచి అందుకున్న సంక్షేమ పథకాలకు తోడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడాలని తీర్పు ఇవ్వడానికేనని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా నమోదైన ఓటర్లు, యువత, పురుషులు సైతం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని విశ్వసిస్తుండడంతో పాటు తణుకులో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు అండగా అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మరో 20 రోజులు ఆగాల్సిందే...

పోలింగ్ పూర్తవడంతో ఇక ఫలితాలపై సర్వత్రా ఆసక్తి రేపుతోంది. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే మే 13న పోలింగ్ పూర్తయ్యింది. అయితే ఫలితాలు మాత్రం జూన్ 4న వెలువడనున్నాయి. దేశ వ్యాప్తంగా అన్ని దశల పోలింగ్ పూర్తైన తరువాతే ఫలితాలు వెల్లడించాల్సి ఉండడంతో మరో 20 రోజులకు అటు అభ్యర్థులు.. ఇటు ప్రజలు వేచి చూడక తప్పదు.

గత ఎన్నికల్లో పోలింగ్ సరళి ఇలా...

2019		
మొత్తం ఓటర్లు	:	2,32,126
మహిళలు	:	1,18,749
పురుషులు	:	1,13,370
ఇతరులు	:	7
మొత్తం పోలైన ఓట్లు	:	1,86,958
మహిళలు	:	96,044
పురుషులు	:	90,913
ఇతరులు	:	1
పోలింగ్ శాతం	:	80.54
2024		
మొత్తం ఓటర్లు	:	2,34,575
మహిళలు	:	1,20,135
పురుషులు	:	1,14,435
ఇతరులు	:	5
మొత్తం పోలైన ఓట్లు	:	1,92,627
మహిళలు	:	98,644
పురుషులు	:	93,979
ఇతరులు	:	4
పోలింగ్ శాతం	:	82.12

ఆచంటలో జోరుగా పందేలు

పెనుగొండ: ఎన్నికలు ముగియడంతో ఆచంట నియోజకవర్గంలో పందేలకు తెరతీశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు, కూటమి అభ్యర్థిగా పితాని సత్యనారాయణలు పోటీ పడ్డారు. నామినేషన్ల నాటి నుంచి ఇరు వర్గాలు హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిలను ప్రజలకు వివరించడంతో పాటు, సొంత ఖర్చులతో నియోజకవర్గంలో పేదలకు అండగా చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వైఎస్సార్ సీపీ ప్రచారంలో దూసుకుపోయింది. నియోజకవర్గంలో 82.80 పోలింగ్ శాతం ఉండడంతో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉంటుందంటూ వైఎస్సార్ సీపీ లెక్కలు వేసి విజయ ఉత్సాహంలో ఉంది. సర్వేలు మాకు అనుకూలంగా ఉన్నాయంటూ టీడీపీ నాయకులు చెప్పుకుంటున్నారు. దీంతో ఎవరి లెక్కలు వారు వేసుకుంటూ పందేలకు కాలు దువ్వుతున్నారు. గత ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇదే ఉత్సాహాన్ని టీడీపీ నాయకులు ప్రదర్శించి మెజార్టీలపై పందేలు కాసి చేతులు కాల్చుకున్నారు. ఆనాడు వైఎస్సార్ సీపీకి 8000లకు పైగా మెజార్టీ వస్తుందంటూ పందేలు గీటు పెట్టడంతో టీడీపీ నాయకులు ఇబ్బడి ముబ్బడిగా పందేలు కాశారు.తీరా ఫలితాల్లో12883 ఓట్లు మెజార్టీతో వైఎస్సార్ సీపీ విజయం సాధించడంతో చిన్నా చితకా నాయకులు అందరూ ఖంగుతిని ఆర్థికంగా నష్టపోయారు. మరోసారి ఇరువర్గాలు పందేలకు సై సై అంటూ ముందుకు వస్తున్నారు. పలానా మండలం మాకు అండగా ఉందని, పలానా మండలం సమానం ఉందంటూ ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. మహిళా ఓటింగ్ గుంబనంగా ఉండడంతో పోలింగ్ సరళిపైనా కూడికలు, తీసివేతలు వేస్తున్నారు. అయితే, ఇప్పటికే శ్రీరంగనాథరాజు విజయం తనదేనంటూ కార్యకర్తలకు, నాయకులు ఆత్మీయ విందు ఇవ్వడం గమనార్హం.

ఘనంగా జాజులమ్మ జాతర



జాజులమ్మను దర్శించుకుంటున్న భక్తులు

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలోని తెలగంశెట్టి వారి మెరకలో ఉన్న జాజులమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామదేవతను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకునేందుకు ఆడపడుచులు దూర ప్రాంతాల నుంచి వచ్చారు. అమ్మవారి వార్షికోత్సవాలను పురస్కరించుకుని జాజులమ్మ ఆలయ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ప్రతీఏటా దాళ్వా పంటలు చేతి కందిన అనంతరం మే నెలలో అమ్మవారి ఉత్సవాన్ని రెండు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం అమ్మవారి నిలబెట్టడం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే బుధవారం భక్తులు, తెలగంశెట్టివారి ఆడపడుచులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యాలను సమర్పించుకున్నారు. ఈ వార్షికోత్సవాల్లో భాగంగా 24న శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధనను నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

కాటన్ దొరకు ఘన నివాళి



తణుకు ఇరిగేషన్ కార్యాలయం వద్ద సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఇరిగేషన్ సిబ్బంది



ఇరగవరం సొసైటీలో కాటన్‌దొర జయంతి కార్యక్రమంలో పాల్గొన్న సొసైటీ అధ్యక్షుడు, సర్పంచ్

తణుకు టౌన్: అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ దొర సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు చెప్పారు. బుధవారం సర్ ఆర్థర్ కాటన్ దొర జయంతిని తణుకులోని ఇరిగేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఇరిగేషన్ ఏఈ ఎన్ బాలమురళీ కృష్ణ మాట్లాడుతూ బ్రిటిష్ సైనికాధికారులు భారతీయుల పట్ల నిరంకుశ ధోరణితో ఉండేవారని, కానీ కాటన్ మహాశయుడు బ్రిటిష్ సైనిక అధికారి బాధ్యతలనుంచి ధవళేశ్వరం ఆనకట్ట బాధ్యతలను చేపట్టి ఆంధ్ర రాష్ట్రాన్ని భారతదేశపు ధాన్యాగారంగా మలిచారని కొనియాడారు. ఆయన అడుగుజాడలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య, కానూరి లక్ష్మీనారాయణ వంటి మనదేశ ఇంజనీర్లు భారత దేశ నదులకు డ్యాములు నిర్మించారన్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ బాల మురళీ కృష్ణను సత్కరించారు. ఈకార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ టీ రామబ్రహ్మం, డాక్టర్ జీఎస్‌వీ ప్రసాద్, వీ సత్యనారాయణరాజు, పీ లక్ష్మణ్, చంద్రశేఖర్ రావు, ఎస్‌వీఎస్ ప్రసాద్, కేవీఎస్ మూర్తి, ఎం మోహనరావు, ఎండీ ఆలంగీర్ బాషా, ఆర్ రామకృష్ణ, కేవీఎస్‌డీ ప్రసాద్, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కాటన్ సేవలు చిరస్మరణీయం

ఇరగవరం: గోదావరి ప్రజలు పాలిట అపరభగీరధుడు సర్ ఆర్థర్ కాటన్ అని సొసైటీ అధ్యక్షుడు, సర్పంచ్ చవాకుల శ్రీనివాస్ తెలిపారు. సర్ ఆర్థర్ కాటన్ 122వ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఇరగవరం ప్రాథమిక సహకార సంఘంలో ఘనంగా నిర్వహించారు. కాటన్‌దొర విగ్రహానికి సొసైటీ అధ్యక్షుడు చవాకుల శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు క్షామంతో తీవ్ర ఇబ్బందులు పడుతుండగా బ్రిటిష్ రాజ్యానికి చెందిన ఇరిగేషన్ ఇంజనీర్ కాటన్ గోదావరి కాలువపై ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి ఈ ప్రాంత ప్రజలకు తాగు, సాగునీటిని అందించిన మహనీయుడన్నారు. ఆయన సేవలు మరవలేనివని చెప్పారు. ఉభయగోదావరి జిల్లాలు అన్నపూర్ణగా మార్చిన మహోన్నత వ్యక్తి, డెల్టా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసి ప్రతి ఒక్కరి గుండెల్లో కొలువై ఉన్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు రామానాయుడు, పాలేశ్వరరావు, రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కాటన్ జయంతి

పెంటపాడు: పశ్చిమడెల్టాలో నీటి ఎద్దడిని లేకుండా చేసి రైతులకు అన్నంపెట్టిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలో పలు గ్రామాల్లో కాటన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జట్లపాలెంలో గ్రామంలోని మిడ్‌లెవిల్ కాలువగట్టున ఉన్న కాటన్ విగ్రహం వద్ద విగ్రహదాతలైన వల్లేపల్లి కుటుంబీకుల ఆధ్వర్యంలో కాటన్ జయంతి వేడుకలు జరిగాయి. పెంటపాడు ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయంలో కాటన్ విగ్రహానికి సెక్షన్ ఏఈ, సిబ్బంది ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. విప్పర్రు గ్రామంలో స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద ఉన్న కాటన్ విగ్రహానికి సొసైటీ అధ్యక్షుడు కళిరెడ్డి అబ్బాయి, కార్యదర్శి సత్యనారాయణ మూర్తితో పాటు, పూలమాలలు నివాళులర్పించారు. రావిపాడు, అలంపురం, మీనవల్లూరులో గ్రామాల్లో ఘనంగా కాటన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

చీకటిపడినా చైతన్యవంతంగా..

- సజావుగా సార్వత్రిక ఎన్నికలు 2024
- ఓటింగ్‌కు ఆసక్తి కనబర్చిన ఓటర్లు
- బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవిత్యం



పుల్లాయిగూడెంలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు



గూడెంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. సోమవారం జరిగిన పోలింగ్‌లో నియోజకవర్గంలోని ఓటర్లంతా తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో ఉన్న 75 బూత్ లలో ఏ బూత్‌లో కూడా పోలింగ్ శాతం 90 శాతం మార్కు చేరలేదు. తాడేపల్లిగూడెం మండలంలో ఉన్న 75 పోలింగ్ కేంద్రాల్లో 30 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ శాతం 90 శాతం దాటగా, పెంటపాడు మండలంలో 60శాతం పోలింగ్ కేంద్రాలలో పది కేంద్రాలలో పోలింగ్ 90 శాతం మార్కు చూసింది. గూడెం మండలంలో బంగారుగూడెం, పట్టింపాలెం, పుల్లాయిగూడెం, కడియద్ద, కృష్ణాపురం, నీలాద్రిపురం, జగ్గన్నపేట, రామన్నగూడెం, చినతాడేపల్లి, తాడేపల్లిలోని బూత్ నంబరు 35లో 90 శాతం పోలింగ్ దాటింది. ఎల్.అగ్రహారం, కొండ్రుపోలు, ఇటుకులగుంట, కుంచనపల్లిలోని బూత్‌నంబరు 41,ఆరుగొలను , కొత్తూరు, దండగర్ర ఆరుళ్ల,నవాబుపాలెం, కృష్ణాయపాలెం గ్రామాల బూత్‌లలో పోలింగ్ 90 శాతం దాటింది. పెంటపాడు మండలంలో ప్రత్తిపాడు, దర్శిపర్రు, బిళ్లగుంట, వల్లూరుపల్లి, రావిపాడు, బోడపాడు, మౌంజీపాడు, ఉమామహేశ్వరం, యానాలపల్లి, ఉమామహేశ్వరం .ముదునూరు బూత్‌లలో పోలింగ్ శాతం 90 దాటింది.

కొత్తూరులో రికార్డు పోలింగ్

తాడేపల్లిగూడెం మండలం కొత్తూరులోని బూత్ నంబరు 50లో రికార్డుస్థాయి పోలింగ్ జరిగింది. ఈ పోలింగ్‌బూత్‌లో 270 మంది ఓటర్లు ఉండగా, 259 మంది (95.93 శాతం) ఓటు హక్కును వినియోగించుకొని రికార్డు సృష్టించారు.

పట్టణంలో 90 మార్కు చూడలేదు.

పట్టణంలో 74 బూత్‌లు ఉండగా ఏ బూత్ లోను పోలింగ్ శాతం 90 శాతం మార్కును చూడలేదు. పట్టణంలోని 103వ పోలింగ్ స్టేషన్‌లో 85.20 శాతం పోలింగ్ జరిగింది. ఇదే రికార్డు. ఇక్కడ 750 మంది ఓటర్లు ఉండగా, 639 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గూడెం మండలంలో ఎల్.అగ్రహారం పరిధిలోని రాజీవ్ గృహకల్ప బూత్‌లో 74.72 శాతం పోలింగ్ జరిగింది. ఇక్కడ 997 మంది ఓటర్లు ఉండగా, 745 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. గూడెం మున్సిపాల్టీ పరిధిలోని 129వ పోలింగ్ కేంద్రంలో స్వల్ప పోలింగ్ జరిగింది. ఇక్కడ 1430 మంది ఓటర్లు ఉండగా, 869 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెంటపాడు మండలంలోని బూత్ నంబరు 176లో తక్కువ పోలింగ్ జరిగింది. ఇక్కడ 810 మంది ఓటర్లు ఉండగా, 593 మంది (73.21 శాతం)ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ మండలంలో అత్యధిక పోలింగ్ పడమర విప్పర్రులోని బూత్ నంబరు 189వ పోలింగ్ కేంద్రంలో జరిగింది. ఇక్కడ 690 మంది ఓటర్లు ఉండగా, 654 మంది (94.78 శాతం) ఓటు వేశారు. నియోజకవర్గ మొత్తంలో 2,14,985 మంది ఓటర్లు ఉండగా, 87,208 మంది పురుషులు, 88,773 మంది మహిళలు, ఇతరులు పది మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం ఓటు వేసిన వారు 1,75,990 మంది. ఓటింగ్ శాతం 81.86 శాతం నమోదైంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇరగవరం: పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఇరగవరం మండలం తూర్పు విప్పర్రు ఏఎస్‌ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగింది. పాఠశాలలో 1998–2003లో విద్యనభ్యసించిన విద్యార్థులంతా హాజరై ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల పూర్వవిద్యార్థులు పాఠశాలలో ఉత్సాహంగా గడిపారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని, ఒకరికొకరు క్షేమ సమాచారం తెలుసుకున్నారు. ఆనాటి పాత విద్యార్థులను ఒకే వేదికపై కలుసుకోవడంతో ఆనాటి ఆటపాటలు, పోటాపోటీ విద్యతోపాటు పాఠశాల ఎగ్గొట్టి చూసిన సినిమాలు, గురువుల బెత్తం దెబ్బలు ఒకరికొకరు నెమరివేసుకున్నారు. తమ తల్లి తండ్రుల ఆశీస్సులు, గురువుల కృషి కారణంగానే తాము ఈరోజు మంచి స్థితిలో ఉన్నామంటూ అప్పటి గురువులను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు ఆనాటి గురువులు సత్యనారాయణ, రాజగోపాల్, అవధాని, రాహీల్, వల్లీ తదితరులు పాల్గొన్నారు.



తూర్పువిప్పర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు